సాక్షి అనకాపల్లి

బుధవారం । 1 । మార్చి । 2023



వెంకన్న కల్యాణానికి.. 8లో

ఉపమాక వెంకన్న కల్యాణానికి గురువారం అంకురార్పణ జరగనుంది. పెండ్లికావిడి ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభిస్తారు.



సర్పంచ్‌పై టీడీపీ నేతల దాడి

వెంకటరాజుపురం సర్పంచ్ సంతోష్‌కుమార్‌పై టీడీపీ నేతలు సోమవారం రాత్రి దాడి చేశారు. కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. 8లో

వాతావరణం

అనకాపల్లి టౌన్: రాగల అయిదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు 32.1 నుంచి 32.2 డిగ్రీలు, గాలిలో తేమ 81 నుంచి 83 శాతం, గాలి గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

గంగాదేవికి మొక్కుల చెల్లింపు



చోడవరం: అడ్డూరులో మంగళవారం జరిగిన గంగాదేవి అమ్మవారి పండగ సందర్భంగా భక్తులు సమర్పించిన అరటి గెలలు ఇవి.. కోరిన కోర్కెలు తీరితే ఇలా అరటి గెలలు నివేదించడం పరిపాటి. అమ్మవారి పండగ సందర్భంగా సంప్రదాయ కళలను ప్రోత్సహిస్తూ తప్పెటగుళ్లు ప్రదర్శించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ భక్తి గీతాలు ఆలపించారు.

బెల్లం తయారీ విధానంలో మూడు కొత్త ప్రాజెక్టులు



శాస్త్రవేత్తలకు సర్టిఫికెట్ అందిస్తున్న ఏడీఆర్ జగన్నాథరావు


అనకాపల్లి టౌన్: వచ్చే ఏడాదికి బెల్లం తయారీ విధానంలో మూడు కొత్త ప్రాజెక్టులు రూపొందించనున్నామని వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు చెప్పారు. ఆర్ఏఆర్ఎస్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బెల్లం తయారు చేసే సమయంలో సల్ఫర్ డయాక్సైడ్ పరిమాణం కొలిచే యంత్రపరికరం.. బెల్లం ఆడే సమయంలో ఇంధనం, విద్యుత్ ఆదా చేస్తూ గ్యాస్‌ఫైర్.. బెల్లం వండే సమయంలో తెట్టు తొలగింపు యంత్రాలను రూపొందించేందుకు ప్రాజెక్టులు కేటాయించామన్నారు. శాస్త్రవేత్తలు డి.ఆదిలక్ష్మి, కిశోర్‌వర్మ, ఎం.చారుమతి, పి.వి.పద్మావతి, టి.చిత్కళాదేవి, బి.భరతలక్ష్మి, ఆర్.విశ్వనాథ్‌లను ఆయన అభినందించారు.

సమ్మిట్‌కు భారీ భద్రత



విశాఖ: విశాఖలో మార్చి 3, 4 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు వచ్చే అతిథులకు 2,500 మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ వెల్లడించారు. ఆంధ్రా యూనివర్సిటీలోని సమ్మిట్ జరిగే ప్రాంతంలో మంగళవారం ఆయన భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మిట్‌కు వచ్చేందుకు సుమారు 10 వేల మంది ప్రతినిధులు రిజిస్టర్ చేసుకున్నారని.. వీరితో పాటు 50 నుంచి 60 మంది వివిధ దేశాల ప్రతినిధులు వస్తున్నట్లు తెలిపారు.

సైంటిస్ట్ ఇన్‌చార్జిగా శర్మ



సాక్షి, విశాఖపట్నం: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్ఐవో) రీజనల్ సెంటర్ సైంటిస్ట్ ఇన్‌చార్జిగా డాక్టర్ వీవీఎస్ఎస్ శర్మ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన చీఫ్ సైంటిస్ట్‌గా ఉన్నారు. ఇప్పటివరకు సైంటిస్ట్ ఇన్‌చార్జిగా ఉన్న జీపీఎస్ మూర్తి మంగళవారం పదవీ విరమణ చేశారు. విశాఖ కేంద్రంగా ఉన్న రీజనల్ సెంటర్‌లో శర్మ 2007 నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఎన్ఐవోలో చేరకముందు ఆయన ఫ్రాన్స్‌లో మూడేళ్లు, జపాన్‌లోని నాగోయ విశ్వవిద్యాలయంలో ఎనిమిదేళ్లు పనిచేశారు.

కారు చౌకగా భారీ చేప

మత్స్యకారులకు నిరాశ

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం తీరంలో మత్స్యకారుల వలకు చిక్కిన భారీ చేప అతి తక్కువ ధరకు అమ్ముడుపోయింది. కనీసం రూ.2 లక్షలు పలుకుతుందని ఆశించిన జాలర్లు నిరాశ చెందారు. ముక్కుడు టేకుగా పిలిచే ఈ అరుదైన చేప సోమవారం మత్స్యకారులకు లభ్యమైన విషయం తెలిసిందే. ప్రాణాలతో ఒడ్డుకు లాక్కొచ్చిన ఈ చేప 720 కేజీల బరువు తూగింది. మంచి ధర పలుకుతుందని ఆశించిన గంగపుత్రులు కాకినాడ, విశాఖపట్నంలో ఉన్న చేపల వ్యాపారులతో సంప్రదించారు. వారు స్పందించకపోవడంతో చేసేది లేక మంగళవారం మైలపల్లి రాజారావు అనే స్థానిక వ్యాపారికి రూ.20 వేలకు విక్రయించారు. ఆయన ఈ చేపను హౌరా ప్రాంతానికి తరలించినట్లు చెప్పారు. భారీ చేపను కొనుగోలు చేసే నాధుడు లేక తక్కువ ధరకు విక్రయించాల్సి వచ్చిందని మత్స్యకారుడు కారే రుడీన్ ఆవేదనగా చెప్పారు.



ఆపద్బాంధవి 108

2004కు ముందు.. : ఆకస్మిక అనారోగ్యం తలెత్తే రోగుల్ని, ప్రమాదం జరిగినపుడు క్షతగాత్రులను అష్టకష్టాలు పడి, ఆస్పత్రులకు చేర్చితే.. సారీ.. లేటయింది.. ఒక్క అరగంట ముందు తీసుకొస్తే బతికించేవాళ్లం.. అని దాక్టర్ల నిట్టూర్పులు వినిపించేవి. దివంగత మహానేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక.. ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. కుయ్.. కుయ్.. కుయ్.. కుయ్.. అంటూ 108 వాహనాలు ఉరుకులు పరుగులతో ఘటనాస్థలికి చేరుకొని ఎందరినో రక్షించాయి. ఆయన మరణం తర్వాత వచ్చిన పాలకులు 108ను నిర్వీర్యం చేశారు.

2019 తర్వాత.. : ఆ మహానేత తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక మళ్లీ 108కు జవసత్వాలు తీసుకొచ్చారు. ప్రస్తుతం ప్రతి మండలానికి ఒక వాహనం ఉండేలా చర్యలు తీసుకున్నారు. బాధితుల పాలిట ఆపద్బాంధవిగా 108 వాహనాల్ని నిలిపారు.

- మండలానికో వాహనం ఏర్పాటు
- ఫోన్ చేసిన నిమిషాల్లోనే చేరుకునేలా చర్యలు
- బాధితులకు పునర్జన్మనిస్తున్న 108 వాహనాలు

నక్కపల్లి: ఒకప్పుడు రోడ్డు ప్రమాదాలు జరిగినా, ఏదైనా కష్టం వచ్చినా, అనారోగ్యం బారిన పడినా ఆస్పత్రికి వెళ్లాలంటే నరక యాతన పడాల్సిందే. సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలు గాల్లో కలిసిపోయేవి. పేద ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 108 వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆయన మరణానంతరం పగ్గాలు చేపట్టిన పాలకులు వాటిని నిర్లక్ష్యం చేశారు. అయితే మూడేళ్ల క్రితం సీఎం పీఠమెక్కిన వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఈ 108 వాహనాలకు జీవం పోశారు. ప్రతి మండలానికి ఒక 108 వాహనం ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా 1,088 వాహనాలను కొనుగోలు చేశారు. ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. నిమిషాల వ్యవధిలో బాధితుల ఇళ్ల వద్దకు, ప్రమాదం జరిగిన సంఘటనా స్థలికి ఈ 108 వాహనాలు చేరుకుంటాయి. బాధితులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు వాహనంలోనే అందిస్తూ.. సమీప ఆస్పత్రులకు తీసుకెళ్తాయి. సకాలంలో వైద్యం అందించేలా తోడ్పడుతున్నాయి. రిఫరల్ ఆస్పత్రుల విషయంలో ఎంత దూరంలో ఉన్నా.. వారిని ఎంత దూరమైనా అక్కడికే తీసుకెళ్లి చేర్చడంలో 108 వాహనాలు సాయపడుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో క్షతగాత్రులకు, కొన ఊపిరితో ఉన్న వారికి ఈ 108 వాహనాలు ప్రాణభిక్ష పెట్టిన దాఖలాలెన్నో ఉన్నాయి. పురిటి నొప్పులతో బాధపడుతూ ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలో 108 వాహనంలోనే ప్రసవించిన ఘటనలు కూడా చాలా ఉన్నాయి.

జిల్లాలో 4 నెలల్లో 8,636 మందికి సేవలు

గర్భిణులు 2426	డయాలసిస్ రోగులు 1,649
రోడ్డు ప్రమాదాలు 1,016	పాము, కుక్కకాటు బాధితులు 219
విష ప్రభావానికి లోనైన వారు 285	గుండెపోటు వచ్చిన వారు 320
ఆయాసం, ఊపిరి ఆడని బాధితులు 1,295	ఇతర వ్యాధులతో బాధపడేవారు 1,426



వాహనంలోనే బాధితులకు వైద్య సేవలు

ఉమ్మడి విశాఖ జిల్లాకు 51 వాహనాలు

ఉమ్మడి విశాఖకు 51 వాహనాలను సమకూర్చారు. వీటిలో అనకాపల్లి జిల్లాకు 22, విశాఖపట్నానికి 15, అల్లూరి సీతారామరాజు జిల్లాకు 14 వాహనాలు కేటాయించారు. ఆపదలో ఉన్నాం, ఆస్పత్రికి వెళ్లాలని ఫోన్ చేస్తే చాలు.. గ్రామీణ జిల్లాలో అయితే 20 నిమిషాల్లోను, విశాఖ సిటీలో అయితే 15 నిమిషాల్లో, ఏజెన్సీ ప్రాంతంలో అయితే 30 నిమిషాల్లో ఈ 108 వాహనాలు చేరుకుంటాయి. ఈ వాహనాల వల్ల బాధితులకు సకాలంలో వైద్య సేవలు అంది ప్రాణాలు కాపాడటంతోపాటు, కుటుంబ సభ్యులకు వేలాది రూపాయల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నాయి.

108లో సదుపాయాలు

ఆక్సిజన్, వెంటిలేటర్, నెబులైజర్, ఏఈడీ, సిరంజ్ పైపు, మల్టీపారామీటర్, ఇన్‌ఫ్యూజన్ పంప్, స్ట్రెచర్, వీల్‌చైర్‌లు అందుబాటులో ఉంటాయి.



ప్రభుత్వం ప్రవేశపెట్టిన 108 వాహనం

తక్షణ స్పందన.. సత్వర వైద్యం



ప్రమాదం, గుండెపోటు తదితర ఆకస్మిక సంఘటనల్లో ఎంత వేగంగా ప్రాథమిక చికిత్స అందించి.. ఆస్పత్రిలో చేర్పిస్తే అంత మంచిది. ఆ విషయంలో 108 వాహనాలు పూర్తిగా విజయవంతమయ్యాయి. తక్షణ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. రోడ్డు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులను ఒక్కొక్క సమయంలో వాహన సిబ్బందే స్ట్రెచర్లపై తీసుకొచ్చి, ప్రాథమిక వైద్యం అందించి ఆస్పత్రిలో చేర్చుతున్నారు. గర్భిణులకు పైసా ఖర్చు లేకుండా వాహనంలో సాధారణ ప్రసవం జరిగేందుకు సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయం.

– కిరణ్, జిల్లా మేనేజర్, 108 అంబులెన్స్ ప్రోగ్రాం

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట చర్యలు

తుమ్మపాల : జిల్లాలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల ప్రక్రియ సక్రమంగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు జాగ్రత్త వహించాలని డీఆర్వో పి.వెంకటరమణ సూచించారు. పట్టణంలోని గుండాల జంక్షన్ సచివాలయంలో ఎన్నికల అధికారులకు మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. డీఆర్వో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. జిల్లాలో 49 పోలింగ్ స్టేషన్లు, 28 ఎన్నికల కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలుగా బుచ్చయ్యపేట, చోడవరం, నర్సీపట్నం, నక్కపల్లి, పాయకరావుపేట, కశింకోట, మునగపాక, రాంబిల్లి, అనకాపల్లిలో నాలుగింటిని గుర్తించామన్నారు. ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రం అనకాపల్లి(1,393 మంది) కాగా, పరవాడ ఉక్కునగరం(85 మంది) పోలింగ్ కేంద్రంలో అతి తక్కువ ఓటర్లున్నట్టు తెలిపారు. జిల్లాలో మొత్తం 42,714 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లలో 22,370, పురుషులు, 14,338 మహిళలు, ఆరుగురు థర్డ్ జెండర్ ఉన్నట్టు వెల్లడించారు. అనకాపల్లిలోని ఏఎంఏఎల్ హైస్కూల్‌ను స్ట్రాంగ్ రూమ్‌గా ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ విశాఖపట్నంలో జరుగుతుందన్నారు. మొత్తం 10 రూట్‌లు, 10 జోన్‌లు ఏర్పాటు చేశామన్నారు. రెండో దశ శిక్షణ ఈ నెల 7న జరగనుందన్నారు. 59 మంది మైక్రోఅబ్జర్వర్లుగా బ్యాంకు అధికారులను నియమించినట్టు పేర్కొన్నారు. 24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 27 కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కలెక్టరేట్‌లో మీడియా కేంద్రం ఏర్పాటు చేశామని, అనుమతి పత్రాలను రిటర్నింగ్ అధికారి జారీ చేయనున్నట్టు వెల్లడించారు.

కంచి పీఠాధిపతికి ఘన స్వాగతం



శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామీజీకి స్వాగతం పలుకుతున్న భక్తులు (ఇన్‌సెట్) శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామీజీ

తుమ్మపాల : కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి మంగళవారం రాత్రి పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సుంకరమెట్ట సూర్యనారాయణస్వామి ఆలయం వద్దకు భారీగా భక్తులు తరలివచ్చారు. అర్చకులు, దేవదాయ శాఖ ప్రతినిధులు స్వామీజీకి పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించిన శోభాయాత్ర మెయిన్‌రోడ్డు మీదుగా శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరుకుంది. స్వామీజీకి ఆలయం వద్ద రాత్రి విడిది ఏర్పాటుచేశారు. రెండు రోజుల పాటు మహా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకాలు, త్రికాలార్చన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ తెలిపారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి బుద్ద మహాలక్ష్మినగేష్, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భరోసా

- నాలుగో ఏడాది మూడో విడత రూ.54.15 కోట్లు జమ
- జిల్లా వ్యాప్తంగా 2,51,048 మంది రైతులకు లబ్ధి
- మాండూస్ బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల



రైతు భరోసా, మాండూస్ తుపాను పరిహారం నమూనా చెక్కును చూపుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, అధికారులు

అనకాపల్లి రూరల్ : వ్యవసాయరంగం అభివృద్ధికి, అన్నదాతల చేయూతకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ నాలుగవ సంవత్సరం మూడో విడత ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. మండలంలోని తగరంపూడి రైతు భరోసా కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 51 వేల 48 మంది రైతుల ఖాతాలకు రూ.54.15 కోట్ల ఆర్థిక సాయాన్ని నేరుగా జమచేశారు. అదే విధంగా మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు కూడా నష్టపరిహారాన్ని ప్రభుత్వం జమ చేసింది. అనకాపల్లి జిల్లాలో 499 మంది రైతులకు రూ.16.12 లక్షలు తుపాను నష్టపరిహారాన్ని ప్రభుత్వం బాధిత రైతుల ఖాతాల్లో వేసింది. సీఎం రైతుభరోసా నిధుల విడుదల ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వీడియో కాన్ఫరెన్సు ద్వారా రైతులు మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు, జిల్లాకు చెందిన అభ్యుదయ రైతులు, కౌలుదారులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా నాలుగేళ్లు

వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పెట్టుబడి సాయాన్ని అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా నాలుగేళ్లు పూర్తి చేసింది. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 51 వేల 48 మంది రైతులు లబ్ధి పొందారు. మాండూస్ తుపాను బాధితులు మరో 499 మందికి ప్రయోజనం కలిగింది.

నాలుగో ఏడాది రెండో విడత వరకు జిల్లాకు చెందిన రైతుల ఖాతాల్లో రూ.1267.93 కోట్ల నిధులు జమయ్యాయి. మూడో విడత నిధులు అదనం. కౌలు రైతులు, ఆర్‌వోఎఫ్ఆర్ రైతులకు కూడా నిధులు విడుదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆలస్యానికి తావులేకుండా ఏటా మాదిరే ఈసారి కూడా వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ నిధులతోపాటు, మాండూస్ తుపాను పరిహారాన్ని కూడా రైతుల ఖాతాలో జమచేయడంతో రైతులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సర్వం సన్నద్ధం



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు, (ఇన్‌సెట్) పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- పెట్టుబడుల సదస్సుకు విశాఖ ముస్తాబు
- ఇన్వెస్టర్లకు స్వాగతం పలుకుతున్న నగరం
- ఏయూ మైదానంలో సిద్ధమవుతున్న వేదికలు
- వేదికల వద్ద అదిరిపోయేలా అడ్వాంటేజ్ ఏపీ ఆకృతులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023కు విశాఖ నగరం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. 24 దేశాలకు చెందిన 8 వేలకు పైగా అతిథులు హాజరవుతున్న సదస్సు కోసం ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు నగరానికి చేరుకొని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం సాయంత్రం నుంచి ప్రముఖుల రాకతో నగరం కళకళలాడనుంది. సదస్సు ఏర్పాట్లను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

130 స్టాళ్లు సిద్ధం

జీఐఎస్ కోసం ఏయూ మైదానంలో ఏర్పాటు చేస్తున్న 5 జర్మన్ హ్యాంగర్స్ హాల్స్ పనులు దాదాపు పూర్తయ్యాయి. 14 రంగాల్లో ఇన్వెస్టర్లను ఆకట్టుకొని.. రాష్ట్రంలో ఉన్న వనరులు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించేలా మొత్తం 130 స్టాళ్లు సిద్ధమవుతున్నాయి. సదస్సుకు వచ్చే ప్రతి ఒక్కరికీ స్వాగతం పలికేలా అడ్వాంటేజ్ ఏపీ పేరుతో ప్రత్యేక ఆకృతులు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొద్ది రోజుల క్రితం ఆమోదించడంతో వాటి ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అతిథుల కోసం ఇప్పటివరకు నగరంలోని పలు హోటల్స్‌లో దాదాపు 1100 గదుల్ని అధికారులు బ్లాక్ చేశారు. వీటితో పాటు నగరానికి వస్తున్న పలు సంస్థల ప్రతినిధులు కూడా నగరంలోని స్టార్ హోటల్స్, రిసార్టులు మొదలుకొని సాధారణ ఏసీ హోటళ్లలో గదులు కూడా బుక్ చేసుకోవడంతో ఈనెల 5వ తేదీ వరకు అన్ని నిండిపోయాయి.

ఎగ్జిబిషన్ ప్రారంభించనున్న సీఎం జగన్

ఈనెల 3వ తేదీన ఉదయం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 ప్రారంభోత్సవంలో దేశ వ్యాప్తంగా వస్తున్న పారిశ్రామికవేత్తలు, విదేశాల నుంచి వస్తున్న ప్రతినిధులతో పెద్ద ఎత్తున ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రధానమైన రంగాలతో పాటు రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలు నడుపుతున్న భారీ పరిశ్రమలను ప్రదర్శించే ఎగ్జిబిషన్ ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. దేశంలో ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు 20 నుంచి 25 దేశాలకు సంబంధించిన వివిధ దేశాల ప్రతినిధులు, 12 నుంచి 14 దేశాల అంబాసిడర్స్, వివిధ దేశాలకు సంబంధించి మరో 8 మంది ముఖ్యులు హాజరుకానున్నారు. ఇప్పటికే యూరోపియన్ యూనియన్ నుంచి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు నగరానికి చేరుకున్నారు. విశాఖపట్నం సహా రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల వనరులు, స్థానికంగా పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను, అనుకూల వాతావరణాన్ని స్టాళ్ల రూపంలో పెద్ద ఎత్తున ప్రదర్శించనున్నారు.

సమన్వయంతో సక్సెస్ చేయాలి

- దేశ, విదేశ వ్యాపార దిగ్గజాల మనసు గెలవాలి
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవెన్



జీఐఎస్ నిర్వహణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కరికాల వలవెన్

మహారాణిపేట (విశాఖ): విశాఖ వేదికగా ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను సమష్టి కృషితో విజయవంతం చేయాలని, ఎలాంటి సమన్వయలోపం లేకుండా వ్యవహరించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(పరిశ్రమలు, వాణిజ్యం) ఆర్.కరికాల వలవెన్ అధికారులను ఆదేశించారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కరికాల వలవెన్ మాట్లాడుతూ ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే అతిథుల మనసు గెలిచేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని సూచించారు. మర్యాదపూర్వకమైన ప్రవర్తనతో వారిని స్వాగతించాలని, వేదికలను చూపించడంలో వారికి సహకరించాలని చెప్పారు. కమిటీలకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. సదస్సు నిర్వహణకు సంబంధించిన ప్రణాళికలు బాగానే రూపొందించారని, వాటి ఆచరణలో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఈ సదస్సు మన దేశానికి, రాష్ట్రానికి, మన ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తుందని.. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఇప్పటివరకు సమ్మిట్‌లు ప్రైవేట్ భాగస్వామ్యంతో జరిగాయని.. ఈ సదస్సు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో జరుగుతోందని గుర్తు చేశారు.

అతిథులకు ప్రత్యేక ఏర్పాట్లు

కలెక్టర్ ఎ.మల్లికార్జున సదస్సుకు సంబంధించి ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాలు, చేసిన ఏర్పాట్ల గురించి వివరించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ నుంచి సదస్సు ముగిసే వరకు చేపట్టాల్సిన విధులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రధాన సమావేశ మందిరం, ముఖ్యమంత్రికి కేటాయించిన సభాస్థలం, స్టాళ్ల ఇతర వసతుల గురించి తెలిపారు. అతిథులను హోటళ్ల నుంచి వేదిక వద్దకు తీసుకొచ్చే విధంగా ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. ఎయిర్, సాధారణ అంబులెన్స్‌లు సిద్ధం చేసినట్లు చెప్పారు. అతిథులకు స్థానిక పర్యాటక ప్రాంతాల గురించి వివరించేలా ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశామని, వారికి ప్రత్యేక బ్రోచర్లు అందజేయనున్నట్లు చెప్పారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, సీపీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గణపర్తిలో యువకుడి దారుణహత్య


గోనె సంచిలో యువకుని తల భాగం

మునగపాక : మండలంలోని గణపర్తి గ్రామంలో మంగళవారం రాత్రి ఓ యువకుడి దారుణ హత్య సంచలనం కలిగించింది. నిందితుడు మృతునికి స్వయాన మేనమామ. వారిద్దరి మధ్య తలెత్తిన వివాదం హత్యకు దారి తీసింది. మంగళవారం రాత్రి గణపర్తిలో జరిగిన సంఘటన స్థానికులను భయాందోళనకు గురి చేసింది. యువకుని తల నరికి గోనె సంచిలో ఉంచి మిగిలిన శరీర భాగాన్ని కాల్చేందుకు ప్రయత్నించగా ఇదే సమయంలో దుర్వాసనతో పాటు పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు సంఘటన స్థలంలోకి వెళ్లి చూడగా నివ్వెరపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నంకు చెందిన గాలి శ్రీను గణపర్తి సచివాలయ సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని చికెన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రెండు రోజులుగా శ్రీను, అతని మేనల్లుడు లోవలు కలిసి అదే ఇంటిలో ఉన్నారు. మంగళవారం రాత్రి ఏం జరిగిందో తెలియదు కానీ లోవ తలను నరికి గోనె సంచిలో వేశాడు. మిగిలిన శరీర భాగాన్ని కాల్చివేసే క్రమంలో పొగలతో పాటు దుర్వాసన రావడాన్ని పక్కనే నివాసం ఉంటున్న కొంతమంది గుర్తించి ఇంటిలోకి వెళ్లిచూడగా భయాందోళనకు గురయ్యారు. రక్తం కారుతున్న తలను చూసి నివ్వెరపోయారు. విషయం తెలుసుకున్న యలమంచిలి సీఐ గఫూర్, ఎస్‌ఐ మహమ్మద్ ఆలీలు సంఘటన స్థలానికి చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు దారి తీసిన వివరాలపై ఆరా తీశారు. శ్రీను సంఘటన స్థలం నుంచి పరారవడానికి ప్రయత్నించగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. రెండు రోజులుగా మద్యం తాగి తనతో గొడవకు దిగడంతో సహించలేక కత్తితో లోవను హత్య చేసినట్టు నిందితుడు శ్రీను పోలీసులకు వివరించాడు. శ్రీనును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఆలీ తెలిపారు.

వెంకన్న కల్యాణానికి రేపే అంకురార్పణ

- పెండ్లికావిడి ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభం
- 3వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణం
- వేసవి తాపాన్ని తట్టుకునేలా టీటీడీ ఏర్పాట్లు


కొత్త రంగులతో ముస్తాబైన హంస, గజవాహనాలు


ప్రధాన రాజగోపురం ఎదురుగా భక్తులు సేద తీరేందుకు ఏర్పాటు చేసిన షెడ్లు

నక్కపల్లి: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణానికి గురువారం అంకురార్పణ జరగనుంది. గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి మార్చి 3వ తేదీ శుక్రవారం రాత్రి వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. ముందురోజు గురువారం ఉదయం 9.45 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాలకు అందరూ ఆహ్వానితులేనంటూ పెండ్లి కావిడిని మాడ వీధుల్లో ఊరేగిస్తారు. భక్తులు స్వామివారికి పసుపు కుంకుమలు, కొబ్బరికాయలు కానుకగా సమర్పిస్తారు. సాయంత్రం అంకురార్పణ చేస్తారు. రాత్రి 7 గంటలకు సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి మత్స్యంగ్రహణం (పుట్టమన్ను) తీసుకురావడానికి ఉత్తర ఈశాన్య దిక్కు గల ప్రాంతానికి తీసుకెళతారు. స్వామిని, అమ్మవార్లను అశ్వవాహనంలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహిస్తారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను ఉంచి అంకురార్పణ చతుస్థాన అర్చనలు, గరుడప్పాల నివేదన నిర్వహిస్తారు. దీంతో స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభమయినట్లేనని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.

వేసవి తాపాన్ని తట్టుకునేలా ఏర్పాట్లు

వేసవి కాలం సమీపించడం, ఎండ వేడిమి ప్రారంభం కావడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా స్వామివారి కల్యాణోత్సవాలకు నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు చేశారు. దర్శనానికి వచ్చే భక్తుల కోసం క్యూకాంప్లెక్స్‌లు, బారికేడ్ల నిర్మాణం, షామియానాలు, జర్మన్ టెంట్లు వేసే కార్యక్రమం పూర్తయింది. భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రధాన రాజగోపురం బయట విశాలమైన పెద్ద షెడ్డు వేశారు. ఆలయం లోపల భక్తులు ప్రదక్షిణలు చేసే ఆస్థాన మండపం, బేడామండపాల్లో టెంట్లు, పందిళ్లు ఏర్పాటు చేశారు. నాచు, పూడిక తీతపనులు చేపట్టి పుష్కరిణి శుభ్రం చేశారు. రక్షణ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. స్వామివారి తిరువీధి సేవల కోసం ఉపయోగించే వివిధ వాహనాలకు ఆకర్షణీయమైన రంగులు వేశారు. మెట్లమార్గంలో రెయిలింగ్, మాడవీధుల్లో ప్రత్యేకంగా విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. షెడ్లలో భక్తులు సేద తీరేందుకు గ్రీన్ మ్యాట్‌లు వేస్తున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేశారు.

కొంగొత్త ఆవిష్కరణలపై రామన్ ఎఫెక్ట్


ఏయూ ఆచార్య రామకృష్ణకు సత్కారం


కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో సీవీ రామన్ ఆంగ్ల అక్షరమాలగా ఏర్పడిన విద్యార్థులు

- సైన్స్ డే వేడుకల్లో ఏయూ ప్రొఫెసర్ రామకృష్ణ
- చోడవరం డిగ్రీ కాలేజీలో గ్రాడ్యుయేట్స్ స్టార్టప్ పోటీ
- తిరుచురాపల్లి కళాశాలకు ప్రథమ స్థానం

చోడవరం రూరల్: సముద్రం నీలం రంగులో కనిపించడానికి కారణం కాంతి పరివర్తనం కాదు, కాంతి విక్షేపణం అన్న సత్యాన్ని కేవలం రూ.75 ఖర్చు చేసే ప్రయోగంతో రుజువు చేసిన అపర మేధావి సర్ సి.వి.రామన్ అని ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.రామకృష్ణ కొనియాడారు. సైన్స్ డే సందర్భంగా మంగళవారం చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సృజనాత్మక ఆలోచనలను వ్యాపార ఆయుధాలుగా మార్చే థీమ్‌తో ×గ్రాడ్యుయేట్స్ స్టార్టప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో పలువురు తమ ఎంట్రీలను పంపించారు. ఇందులో వరుస స్థానాల్లో తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లి కళాశాల, ఆంధ్రా యూనివర్సిటీ, రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చోడవరం కళాశాల నిలిచాయి. ఈ సందర్భంగా సైన్సు డే వేడుకల్లో ఆచార్య రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని సీవీ రామన్ ఆవిష్కరణలను వివరించారు. భారత ప్రభుత్వం రామన్ పేరున ఏర్పాటు చేసిన పోస్టు డాక్టర్ ఫెలోషిప్ పొంది అమెరికాలో పరిశోధనలు చేసి గౌరవం పొందిన కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు అభినందనీయుడన్నారు. కార్బన్ డయాక్సైడ్ పెరుగుదలను నివారించే విధానాలు, వ్యర్థ జలాలను మంచినీరుగా మార్చే ప్రక్రియలను ఉత్తమ ఆలోచనలుగా ఎంపిక చేసి విజేతలకు రూ.5 వేలు, రూ.3 వేలు, కన్సొలేషన్ బహుమతిగా రూ.2 వేలు చొప్పున బహుమతులను వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ ప్రకటించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాంబాబు, జె.లక్ష్మి, మంగమ్మ, ఫిజిక్స్ విభాగాధిపతి రఫీయుద్దీన్, భూషణరావు, సత్యవతి, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

లింగరాజుపాలెం విద్యార్థి ప్రదర్శనకు అవార్డు



రాష్ట్ర స్థాయి అవార్డు అందుకుంటున్న విద్యార్థి గణేష్, ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు


సైన్స్ ఫెయిర్‌లో లెక్కల మ్యాజిక్ ప్రదర్శిస్తున్న గణేష్ (ఫైల్)

ఎస్.రాయవరం: విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఉత్తమ ప్రాజెక్టులను మంగళవారం ప్రకటించారు. మేథమెటికల్ మోడలింగ్ విభాగంలో ఎస్.రాయవరం మండలం లింగరాజుపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి జి.గణేశ్ ప్రదర్శనకు ద్వితీయ బహుమతి లభించింది. ప్రతిభ కనబరచిన 8వ తరగతి విద్యార్థి గణేష్‌ను, గైడ్‌గా వ్యవహరించిన లెక్కల ఉపాధ్యాయుడు కోన నాగేశ్వరరావును ప్రధానోపాధ్యాయుడు కె.ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి


ఎన్నికల ప్రచార కరపత్రాలను విడుదల చేస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, సన్యాసిపాత్రుడు

- డీసీసీబీ చైర్‌పర్సన్ అనిత

నర్సీపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, సన్యాసిపాత్రుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని వివిధ సంఘాల ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. సుధాకర్ గెలుపును కాంక్షిస్తూ ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్ల కాలంలో 98 శాతం హామీలను నెరవేర్చి అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించారన్నారు. ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరినీ కలిసి సుధాకర్ గెలుపునకు సైనికుల్లా పని చేయాలన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఒమ్మలి విద్యార్థిని


దివ్యను అభినందిస్తున్న హెచ్‌ఎం శోభారాణి, పీడీ సత్యం

మాడుగుల: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని ఒమ్మలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని తెప్పల దివ్య ఎంపికైంది. ఈ నెల 17, 18, 19 తేదీల్లో విశాఖ జిల్లా భీమునిపట్నంలో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి అండర్ - 14 విభాగంలో ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఇందులో ప్రతిభ కనబరిచిన దివ్య రాష్ట్ర జట్టు తరఫున జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనడానికి ఎంపికైంది. ఈ హైస్కూల్ నుంచి గత నెలలో కర్నూలు జిల్లా నంద్యాల, తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో జరిగిన ఖోఖో పోటీల్లో నలుగురు, త్రోబాల్‌కు ఇద్దరు ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం శోభారాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఉగ్గిన అప్పలనాయుడు, సర్పంచ్ సుంకరి సింహాచలం నాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షుడు బొద్దపు భాస్కరరావు, తల్లిదండ్రులు దివ్యను అభినందించారు.

సర్పంచ్‌పై టీడీపీ నేతల దాడి

- తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో కేజీహెచ్‌లో చికిత్స
- రాజకీయంగా ఎదుర్కోలేక భౌతికదాడులు
- పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో సర్పంచ్ భార్య శివకుమారి వెల్లడి


కేజీహెచ్‌లో అపస్మారక స్థితిలో ఉన్న సర్పంచ్ సంతోష్‌కుమార్

దేవరాపల్లి : మండలంలో వైఎస్సార్‌సీపీకి చెందిన వెంకటరాజుపురం గ్రామ సర్పంచ్ దాసరి సంతోష్ కుమార్ అలియాస్ చంద్రయ్యపై టీడీపీ నేతలు సోమవారం రాత్రి దాడి చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక, అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు పక్కా వ్యూహంతో మూకుమ్మడిగా తన భర్తపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారని సంతోష్‌కుమార్ భార్య శివకుమారి మంగళవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక టీడీపీ నాయకుడు లెక్కల సూర్యనారాయణ సహా పదిమంది తన భర్తపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, దీంతో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. టీడీపీ నేతల నుంచి తన భర్తకు ప్రాణ హాని ఉందని రక్షణ కల్పించాలని ఆమె కోరింది. ఇదిలా ఉండగా సూర్యనారాయణ భార్య కుమారి కూడా తన భర్తపై కొందరు దాడి చేసి గాయపరచడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇంచార్జ్ సీఐ హోదాలో చోడవరం సీఐ బి. శ్రీనివాసరావు, స్థానిక ఎస్‌ఐ డి.నాగేంద్ర మంగళవారం రాత్రి గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేశారు.

సర్పంచ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సంతోష్‌కుమార్‌ను దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అతని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. సర్పంచ్‌పై టీడీపీ నేతలు భౌతిక దాడులకు తెగబడడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

బావిలో యువకుడి మృతదేహం


బావి నుంచి బయటకు తీసిన వీరనాగేంద్ర మృతదేహం (ఇన్‌సెట్) వీరనాగేంద్ర (ఫైల్)


సంఘటన స్థలం వద్ద విలపిస్తున్న మృతుడి తల్లి, కుటుంబ సభ్యులు

పాయకరావుపేట : మండలంలో గల పి.ఎల్.పురం గ్రామంలో వ్యవసాయ బావిలో యువకుడి మృతదేహం లభ్యమయింది. సంఘటన స్థలం వద్ద నున్న స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పీఎల్‌పురం గ్రామానికి చెందిన వడ్లమూరి వీరనాగేంద్ర (22) అదే గ్రామానికి చెందిన మేడిశెట్టి సూర్యానారాయణ అనే దివాణం పొలంలో నాలుగు సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. పొలం పనులను, పశువులను చూసుకుంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి వద్ద నుంచి బయటకు వచ్చి తాను పనిచేస్తున్న పొలం బావిలోనే విగతజీవిగా పడి వుండడం స్థానికంగా సంచలనం రేపింది. కాగా మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు వీర నాగేంద్ర ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వారిని, స్నేహితులను అడగ్గా ఎవరికీ అతని ఆచూకీ తెలియలేదు. గ్రామం సమీపంలోనే వున్న పొలం, మకాం, బావి అంతా పరిశీలించారు. బావిలో నీటి అడుగున మృతదేహం ఉన్నట్లు గమనించారు. బావిలో వీరనాగేంద్ర రెండు చేతులు, కాళ్లు తాళ్ళతో కట్టేసి పడి ఉన్నాడు. పొలం యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, సీఐ పి.అప్పలరాజు, ఎస్‌ఐ రమేష్ సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. బావి వద్ద మృతుడి రుమాలు, జోళ్ళు, సెల్‌ఫోన్ గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. అనకాపల్లి క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ వచ్చి సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి తల్లిని డీఎస్పీ ప్రవీణ్ కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీసి పోస్టుమార్టంకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు సీఐ అప్పలరాజు తెలిపారు. కాగా నాగేంద్ర తండ్రి ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. నాగేంద్ర మృత్యువాత పడడంతో తల్లి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంటున్నారు.

ఆర్టీసీ భవనంలో 'స్కిల్' సెంటర్!


ద్వారకా బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ భవనం

- ఏర్పాటు చేయనున్న చమురు సంస్థలు
- నిర్వహణ బాధ్యత చూడనున్న హెచ్‌పీసీఎల్
- బిల్డింగ్ విస్తీర్ణం 84 వేల చదరపు అడుగులు
- పుష్కర కాలం నుంచి వృథాగా ఐదంతస్తుల భవనం
- అద్దె ద్వారా నెలకు రూ.11.60 లక్షల ఆదాయం

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీకి చెందిన ఐదంతస్తుల ఆ భవనం ఒకప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాలతో కళకళలాడుతూ ఉండేది. పుష్కర కాలం నుంచి ఖాళీగా, వృథాగా ఉంది. నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటోంది. గతంలో ఖాళీగా ఉన్న ఆ బిల్డింగ్‌ను అద్దెకు తీసుకోవడానికి పలు సంస్థలు, ఆస్పత్రుల యాజమాన్యాలు ఆసక్తి కనబరిచాయి. కానీ భవనం కింద ఫ్లోర్‌లో వాణిజ్య దుకాణాలు, దక్షిణం వైపున ద్వారకా బస్‌స్టేషన్, ఉత్తరం దిక్కులో ఓ పెద్ద జ్యూయలరీ షాపు ఉన్నాయి. దీంతో అంత పెద్ద భవనానికి పార్కింగ్ సదుపాయం లేకుండా పోయింది. ఫలితంగా పార్కింగ్ సమస్య వల్ల ఇన్నాళ్లూ ఇది నిరుపయోగంగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ భవనంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు భారతీయ చమురు సంస్థలు సంయుక్తంగా ముందుకొచ్చాయి. ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఓఐఎల్, ఓఎన్‌జీసీ తదితర చమురు సంస్థలు తమ సీఎస్సార్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో దేశంలోని వివిధ నగరాల్లో ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. విశాఖలోనూ ఈ సెంటర్‌ను నడపడం కోసం ఈ బిల్డింగ్‌ను ఎంపిక చేసుకుంది. ఈ సెంటర్‌కు వచ్చే వారు విద్యార్థులే కావడంతో పార్కింగ్ సదుపాయం అంతగా అవసరం లేదు. దీంతో నగర నడిబొడ్డున, రవాణా సదుపాయం ఉన్న ఈ సువిశాల భవనం తమ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు అనువుగా ఉంటుందన్న ఉద్దేశంతో చమురు సంస్థలు లీజు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సెంటర్ నిర్వహణ బాధ్యతను విశాఖ హెచ్‌పీసీఎల్ చూసుకుంటుందని తెలుస్తోంది.

85 వేల చదరపు అడుగులు

ద్వారకా బస్‌స్టేషన్ స్థలంలో దాదాపు 40 ఏళ్ల క్రితం ఆర్టీసీ నిర్మించిన ఐదంతస్తుల ఈ భవనం విస్తీర్ణం సుమారు 84 వేల చదరపు అడుగులు. ఈ భవనానికి చదరపు అడుగుకు నెలకు రూ.13.89 చొప్పున అద్దె చెల్లించేలా చమురు సంస్థలతో ఒప్పందం కుదిరింది. ఈ లెక్కన అద్దె ద్వారా ఆర్టీసీకి నెలకు రూ.11.60 లక్షల ఆదాయం సమకూరనుంది. ఈ భవనం లీజు ఒప్పందం పదేళ్ల పాటు ఉంటుంది.

అవసరమైన పనులు మొదలు



ఈ ఆర్టీసీ భవనాన్ని చమురు సంస్థలకు అప్పగించడానికి ముందు కనీస సదుపాయాలను కల్పించాల్సి ఉంది. విద్యుత్ సదుపాయం, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి వాటిని సమకూర్చడంతో పాటు అవసరమైన పనులు మొదలు పెట్టాం. మరో నాలుగైదు నెలల్లో ఈ భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

–ఎ.అప్పలరాజు, జిల్లా ప్రజా రవాణా అధికారి

క్రూడ్ వేస్ట్ ఆయిల్ పంపింగ్ సమయంలో ఘటన


ఘటనా స్థలం నుంచి తెల్లటి పొగతో వస్తున్న మంటలు


గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న సీఐ లూథర్‌బాబు

- హెచ్‌పీసీఎల్ అధికారుల నిర్ధారణ
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు కార్మికులు ఆరిలోవ వద్ద ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థలోని ఏటీపీ(అడిషనల్ ట్యాంక్స్ ప్రాజెక్ట్) వద్ద సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగి, ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఇక్కడ క్రూడ్ ఆయిల్ పైపులైన్ లీక్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని తొలుత అందరూ భావించారు. అయితే క్రూడ్ వేస్ట్ ఆయిల్ పంపింగ్ సమయంలో అగ్ని ప్రమాదం జరిగిందని అధికారులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో పెందుర్తి, రాంపురం ప్రాంతానికి చెందిన చంద్రబాబు 60 శాతం కాలిపోయాడు. ఇతను టెక్నీషియన్. శాశ్వత ఉద్యోగి. 104 ఏరియా ప్రాంతానికి చెందిన జి.రమణ కాంట్రాక్ట్ కార్మికుడు(డ్రైవర్). 20 శాతం గాయపడ్డాడు. వీరిని ఆరిలోవ వద్ద ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చంద్రబాబుకు మూడు నెలల కిందటే వివాహం జరిగినట్లు తెలిసింది. ప్రమాదం జరిగినప్పుడు పెద్ద ఎత్తున తెల్లటి పొగతో కూడిన మంటలు రావడంతో.. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న మిగిలిన కార్మికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. సంస్థ అధికారుల ద్వారా సమాచారం అందుకున్న మల్కాపురం సీఐ లూథర్ బాబు ఘటన స్థలానికి వెళ్లి ప్రమాదంపై ఆరా తీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారి నుంచి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. విచారణ అనంతరం ఈ ఘటనపై కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

రైలు ఢీ కొట్టి వ్యక్తి మృతి


రైలు ఢీకొట్టి మృతి చెందిన వ్యక్తి

పాయకరావుపేట : నాగరాజుపేట రైల్వే గేటు సమీపాన గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో మృతి చెందినట్టు రైల్వే పోలీసు ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సుమారు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి స్కై బ్లూ కలర్ షర్టు ధరించి ఉన్నారన్నారు. కాళ్లకు, చేతులకు రక్షలు కట్టుకుని ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

ఘనంగా పారిపల్లెమ్మ పుట్టుక మహోత్సవం



పారిపల్లెమ్మ అమ్మవారి పుట్టుక మహోత్సవం

మునగపాక : వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మ అమ్మవారి పుట్టుక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నేల వేషాలు ఏర్పాటు చేశారు. మార్చి 7న వాడ్రాపల్లిలో జరగనున్న పారిపల్లెమ్మ అమ్మవారి పండగ సందర్భంగా పుట్టుక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, కోలాటం వంటి ప్రదర్శనలు అందరినీ అకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, రామజోగినాయుడు, మళ్ల వరహా నరసింగరావు, దశావతారం, నూకప్పారావు, శేషు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శించిన ఎంపీడీవో

రాంబిల్లి: ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలందించాలని ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు పంచదార్ల సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన పంచదార్ల సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దీనికనుగుణంగా సిబ్బంది పనిచేయాలన్నారు. అనంతరం పంచదార్ల, భోగాపురం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో ఆదేశించారు.

6న ఎన్‌సీసీ ఫెస్ట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ మురళీరావు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి విద్యా సంస్థల్లో మార్చి 6న నిర్వహించనున్న ఎన్‌సీసీ ఫెస్ట్‌కు సంబంధించిన 'ద్రోణ 23' పోస్టర్‌ను స్థానిక సీఐ మురళీరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి మణికంఠ మాట్లాడుతూ ఫెస్ట్‌లో అగ్నిమాపక డ్రిల్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సాహస కృత్యాలు, ఎన్‌సీసీ కేడెట్స్ పరేడ్, దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనకాపల్లి జిల్లాకు చెందిన అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోనసీమ	సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్	సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
డెడ్‌లైన్	పర్తిసాయి
వీరసింహారెడ్డి	వెంకటేశ్వర
శ్రీదేవి శోభన్‌బాబు	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 7,693 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,610	4,000
మొదటి రకం	3,420	3,690
రెండో రకం	3,130	3,470
మూడోరకం	2,940	3,120

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్-14 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 571 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సృజనకు పదును.. ఆవిష్కరణలకు అదను



తాళ్లపాలెంలోని ఓ హైస్కూల్లో సైన్స్ నమూనాల ప్రదర్శన



పట్టణ బాలికోన్నత స్కూల్లో పోటీల విజేతలతో ఉపాధ్యాయులు



కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్లో ఇస్రో నమూనా ప్రదర్శన



రంగుల కలయికను వివరిస్తున్న కరస్పాండెంట్ గిరీష్‌కుమార్

'నా మతం సైన్స్.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అంటూ తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణలోనే గడిపిన దార్శనికుడు చంద్రశేఖర వెంకట రామన్(సర్ సీవీ రామన్). ఆయన 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను ఆవిష్కరించారు. పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లడమేంటి? విదేశీయులే.. పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహోన్నతుడాయన. భౌతికశాస్త్రంతో ఆయన అందించిన అపారమైన సేవలకు గుర్తుగా ఫిబ్రవరి 28ని జాతీయ సైన్స్ దినోత్సవంగా ఏటా జరుపుతున్నాం. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని చాలా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి.

- విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం పెరిగేలా
- పాఠశాలల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో సైన్స్ నమూనా పరిశీలిస్తున్న హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి

అనకాపల్లిటౌన్ : పట్టణం, మండలంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మంగళవారం జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.

• స్థానిక జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో నోబుల్ చారిటీస్ సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సైన్స్ ప్రాముఖ్యతను వివరించి సీవీరామన్ చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు శరగడం నూకరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు విద్యార్థులకు డిబేట్ పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సీహెచ్ మహాలక్ష్మి, ఉపాధ్యాయులు రమాదేవి, రాజేశ్వరి, రామాంజనేయులు, లక్ష్మి, పాల్గొన్నారు.

• పెదహైస్కూల్, భీమునిగుమ్మం హైస్కూల్, గవరపాలెం చినహైస్కూళ్లలో సైన్స్ దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి.

• స్థానిక ఉడ్‌పేట హ్యాపీకిడ్స్ ప్లేస్కూల్లో సైన్స్ దినోత్సవంలో భాగంగా సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. కరస్పాండెంట్ శెట్టి గిరీష్‌కుమార్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. ప్రకృతిలో ప్రతి విషయాన్ని శాస్త్రీయ కోణంలో ఆలోచించాలని సూచించారు. అంతకుముందు రంగుల కలయిక ద్వారా ఏర్పడే కొత్త రంగులు, ద్రవాలు వాటి యొక్క ద్రవ్యత ఆధారంగా ఎలా తేలియాడతాయి, వాయువులు, వాటి వాసనలు వంటి ప్రయోగాలు చేసి చిన్నారులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

• విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల సరైన దృక్పథాన్ని అలవర్చుకోవాలని డైట్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ చల్లా నర్సింహం అన్నారు. అంతకుముందు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని పలు పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నమూనాలను, విన్యాసాలను ప్రదర్శించిన విద్యార్థులు ఆకట్టుకున్నారు.

• స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో పలు సైన్స్ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ప్రారంభించిన హెచ్‌ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో విజ్ఞానాన్ని అందించే నమూనాలను తయారు చేశారని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సివీ రామన్ ఆంగ్ల అక్షర మాల రూపంలో విన్యాసాలు ప్రదర్శించి ఆహూతుల్ని అలరించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఆచంట రవి, కె.అప్పారావు, వి.ప్రభాకర్, దేవానంద్, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

• కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూల్లో సీవీ రామన్ చిత్ర పటానికి స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సైన్స్ ప్రదర్శన విశేషంగా అలరించింది. లైఫ్ ఆన్ మార్స్, సోలార్ పవర్ ఇరిగేషన్ తదితర నమూనాలు విద్యార్థులను బాగా ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కరెస్పాండెంట్ బత్తుల అనూరాధ, ప్రిన్సిపాళ్లు రూపానంది, మహేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



సెయింట్ జాన్స్ విద్యార్థుల స్కేటింగ్ విన్యాసం

• తాళ్లపాలెంలోని గాయత్రి స్కూల్లో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. సీవీ రామన్‌పై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుడు ఐ.అప్పారావు, కరస్పాండెంట్ బి.రామకుమార్, హెచ్‌ఎం వై.నగేష్, సైన్స్ ఉపాధ్యాయుడు ఎం.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



తగరంపూడిలో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

- తగరంపూడిలో రైతులకు అవగాహన

అనకాపల్లి రూరల్ : రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకర ఉత్పత్తులు పండించవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని తగరంపూడి రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. వివిధ వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించి, నవధాన్యాల సాగును ఎలా చేపట్టాలో వివరించారు. దీనికి హాజరైన జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు ప్రకృతి వ్యవసాయ విధానంలో భూసారం కాపాడుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు, అధికారుల సూచనలు, సలహాలను పాటించి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని రైతులకు తెలిపారు. విత్తన బంతుల తయారీ, వినియోగంపై రైతులకు వివరించారు. సింథటిక్ రసాయన ఎరువులు, పురుగు మందులు, కలుపు సంహారకాలు వంటివి వాడకుండా చేపట్టే ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం క్రమంగా పెరుగుతోందన్నారు. రైతులు ఈ తరహా సాగును మరింత చేపట్టాలని వ్యవసాయ సాధికార సంస్థ అధికారులు సూచించారు.

7న పైడిమాంబ పండగ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: పరవాడ గ్రామంలో ఈ నెల 7న నిర్వహించనున్న పైడిమాంబ అమ్మవారి ఉత్సవాల పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 5 నుంచి 7 వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, పెద్దలు సిరపరపు రాజేష్, పైల హరీష్, పోతల అప్పలనాయుడు, పైల అప్పలనాయుడు, సిరపరపు అయ్యబాబు, బంగారుబాబు పాల్గొన్నారు.

అటు నేహా..ఇటు అనసూయ

- పరదేశిమాంబ అమ్మవారి ఉత్సవంలో మెరిసిన తారలు

సబ్బవరం : ఉదయం భక్తులతో ఆ ప్రాంగణం పులకించింది..సాయంత్రం సెలబ్రిటీలతో సందడి నెలకుంది. డీజే టిల్లు ఫేం నేహాశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. బుల్లితెర బ్యూటీ అనసూయ కిరాక్ పుట్టించింది. బుల్లెట్ బండి సింగర్ మోహన్ భోగరాజు తన గళంతో ఈవెంట్‌ను తారాస్థాయికి తీసుకువెళ్లారు. జబర్దస్త్ యాంకర్ సౌమ్యారావు తన మాటలతో ఆకట్టుకున్నారు. మండలంలోని తవ్వవానిపాలెం వాసుల ఆరాధ్య దేవత పరదేశిమాంబ అమ్మవారి ఉత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పండగ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన గుర్రపు పందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ప్రారంభించారు. అనుపు మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ మందుగుండు పోటీలు మిరుమిట్లు గొలిపాయి. రాత్రికి నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమంతో పాటు రాకెట్ రాఘవ టీమ్, పలువురు వెండి, బుల్లితెర నటులు సందడి చేశారు.



కళాకారులతో డ్యాన్స్ చేస్తున్న అనసూయ

పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించాలి

మునగపాక : తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై దృష్టి సారించాలని మ్యాజిక్ బస్ సంస్థ అకడమిక్ ఎడ్యుకేటర్ పి. ఆనంద్ కోరారు. మునగపాక బీసీ కాలనీలో మంగళవారం మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం విషయంలో పిల్లలు భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండేలా పిల్లలను అనునయించాలన్నారు. సెల్‌ఫోన్ వ్యసనం పిల్లల్లో తీవ్ర పరిణామాలకు దారితీస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ ఆళ్ల శ్యామల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మ్యాజిక్ బస్ సంస్థ అకడమిక్ ఎడ్యుకేటర్ ఆనంద్

హిందూ ధర్మంతో జ్ఞాన వికాసం



ధర్మ ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞానవేదిక సభ్యులు

పరవాడ: దేశపాత్రునిపాలెం గ్రామంలో త్రైత సిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవా సమితి సభ్యులు మంగళవారం నిర్వహించిన హిందూ ధర్మ ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలు చదివి దేశానికి పూర్వ వైభవం తేవాలన్న లక్ష్యంతో ఇంటింటా హిందూ ధర్మ ప్రచారం చేపడుతున్నామని అనకాపల్లి ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవి, రేవతి, మణి, పద్మ, అక్షయ్‌కుమార్, సర్వదార, అశోక్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు ప్రారంభోత్సవం

మునగపాక: అరబుపాలెం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. అరబుపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.4లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీకి ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జితో కలిసి మంగళవారం పనులు ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్ కూర్మారావు పాల్గొన్నారు.



అరబుపాలెంలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బుజ్జి

రైతు సంక్షేమమే ధ్యేయం

మునగపాక : రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ఆదర్శ ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారన్నారు. మూడో విడత రైతు భరోసా పంపిణీలో భాగంగా మండలంలోని అరబుపాలెం రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కింద ఏడాదికి రూ.13,500 మేర నగదు అందజేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, వీఏఏ సత్య రవిరాజ్, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌తో 'ఉపాధి' అక్రమాలకు చెక్

గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు, స్థానిక టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే ఉపాధి పనులు జరిగేవి. ప్రభుత్వం నుంచి వచ్చే ఉపాధి నిధులకు, వాస్తవంగా లబ్ధి పొందే కూలీలకు పొంతన ఉండేది కాదన్న ఆరోపణలు నిత్యం వెల్లువెత్తేవి. పనుల్లోకి రాకున్నా.. తమ అనుయాయుల పేరిట మస్టర్ వేసి, ఉపాధి నిధులు దోచేసేవారు. అలాంటి వారికి జగనన్న ప్రభుత్వంలో చెక్ పడింది. సాధ్యమైనంత ఎక్కువ మంది ఉపాధి పథకంలో లబ్ధి పొందాలని ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో ఆన్‌లైన్ హాజరును తీసుకొచ్చారు.



కూలీలకు ఆన్‌లైన్ అటెండెన్స్ వేస్తున్న మేట్



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- సోషల్ ఆడిట్‌లో కూలీల హాజరుపై ఆరోపణలు
- ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో మస్టర్ నమోదు
- జనవరి 1 నుంచి పటిష్టంగా అమలు

అనకాపల్లి రూరల్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఒకప్పుడు అక్రమాలు ఎక్కువగా జరిగేవి. పనులకు హాజరు కాకున్నా మస్టర్(హాజరు) వేసి ఉపాధి నిధులను నొక్కేసేవారు. సామాజిక తనిఖీల్లో ఇలాంటి ఎన్నో అవకతవకలు బయటపడ్డాయి. దీంతో ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూలీల మస్టర్ నమోదులో అక్రమాలకు తావు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్‌ఎంఎంఎస్)ను అమలు చేస్తోంది.

జనవరి నుంచి అమలు

ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. 2006లో ఈ పథకం ప్రారంభం కాగా కూలీల మస్టర్ నమోదులో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రారంభంలో మేన్యువల్‌గా మస్టర్ వేసేవారు. అనంతరం 2021 జనవరి 1వ తేదీ వరకు ఎస్‌ఎంఎంఎస్ పోర్టల్‌లో ఫీడ్ చేయడం ద్వారా హాజరు వేసేవారు. 20 మంది కంటే ఎక్కువ కూలీలు ఉంటేనే ఈ విధానం అమలయ్యేది. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో పనిచేసే చోటే కూలీల హాజరును నమోదు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వాలకు కూలీల వాస్తవ హాజరుపై స్పష్టత వచ్చింది.

ఉదయం, సాయంత్రం మస్టరు

గతంలో ఎస్‌ఎంఎంఎస్ ద్వారా 20 మంది కంటే ఎక్కువ కూలీలు హాజరైతేనే ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి వీలు పడేది. అంతకు సంఖ్య తగ్గితే ఈఎంఎంఎస్ ద్వారా హాజరు ఉండేది. ప్రస్తుత ఎన్‌ఎంఎస్ ద్వారా సంఖ్యతో పని లేకుండా కేవలం ఒకే కూలీ ఉన్నా.. ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందే. ఒకవేళ ఆన్‌లైన్‌లో అటెండెన్స్ నమోదు చేయకపోతే కూలీలకు ఎటువంటి పేమెంట్ ఉండదు. రెండు సార్లు పని ప్రదేశంలో ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. మస్టర్‌లో 10 మంది కూలీల హాజరు ఒకసారి నమోదు చేయాలి. ఒక పనికి 25 మంది కూలీలు హాజరైతే మూడు సార్లు మస్టర్ వేస్తారు. మస్టర్‌లో ఎంతమంది హాజరు ఉంటే అంతమంది కనిపించే విధంగా ఫొటో తీయల్సి ఉంటుంది. ఉదయం 7 గంటలకు మస్టర్ వేసి ఫొటో అప్‌లోడ్ చేసిన 4 గంటల తర్వాత మరోసారి మస్టర్ వేసి కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. మస్టర్‌కు, ఫొటోలో కనిపించే కూలీల సంఖ్యకు తేడా వస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు.

అక్రమాలకు అడ్డుకట్ట

ఉపాధి పథకం ప్రారంభంలో కూలీల మస్టర్ల విషయంలో ఎన్నో ఆరోపణలు వచ్చాయి. సోషల్ ఆడిట్ జరిగినపుడు ప్రతి చోటా కూలీల హాజరు విషయంలోనే సమస్య తలెత్తేది. కొన్ని చోట్ల ఘర్షణ వాతావరణం నెలకొనేది. అంటే ఫీల్డు అసిస్టెంట్లు కొంత మంది కుటుంబ సభ్యులు, వారికి అనుకూలమైన వారు పనులకు రాకపోయినా.. మస్టరు వేసి అక్రమాలకు పాల్పడిన సంఘటనలు బయటపడ్డాయి. ఇలా బయటపడ్డాక స్వాహా చేసిన సొమ్మును చెల్లించకుండా కాలయాపన చేసేవారు. ప్రస్తుతం అమలులోకి వచ్చిన నూతన విధానంతో ఇలాంటి అక్రమాలకు చెక్ పడనుంది.

మినహాయింపులున్నాయ్



ఉపాధి హామీ పథకంలో అక్రమాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఎన్‌ఎంఎంఎస్ హాజరు విధానం ద్వారానే కూలీలకు వేతనాలు లభిస్తున్నాయి. బినామీలు, అనర్హులు లబ్ధిపొందే అవకాశం ఎంతమాత్రం లేదు. విస్తృతంగా తనిఖీలు జరిపి పనుల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. అయితే ప్రస్తుతమున్న ఆన్‌లైన్ హాజరు విధానం నుంచి వ్యక్తిగత(ప్లాంటేషన్, కందకాలు, రీ ప్లాంటేషన్, హార్టికల్చర్, హౌసింగ్ తదితర) పనులకు మినహాయింపు ఉంది. – జె మణికుమార్, ఏపీడీ, అనకాపల్లి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కశింకోట : తనను గెలిపిస్తే ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగ, యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ మద్దతు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు అన్నారు. మండలంలోని కన్నూరుపాలెం, కశింకోటలోని హైస్కూళ్లలో ఉపాధ్యాయులను కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటును వేసి తనను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవిందసత్యనారాయణ, కె.ఎస్.ఎన్ రాజు, పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు బుద్ధ నాగజగదీష్, పార్టీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, మాజీ ఎంపీపీ పెంటకోట సుబ్బలక్ష్మి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. బయ్యవరంలో పార్లమెంట్ నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎస్‌కె రెహమాన్(బాబర్) ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవిరావుకు మద్దతుగా ప్రచారం చేశారు.